క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీలకు సన్మానం



బాపట్ల: బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌లను బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో అన్ని చర్యలు తీసుకొని సమర్థంగా ఎన్నికలను నిర్వహించారని ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ఇద్దరు అధికారులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. బాపట్ల ప్రజానీకం తరఫున వారిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, చిత్రకారుడు జీవీ పాల్గొన్నారు.

ఎన్నికల అధికారికి సన్మానం



వేమూరు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల అధికారి వసంతరాయుడు ఆధ్వర్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహసీల్దారు వి కిరణ్ తెలిపారు. జంపనిలో నియోజకవర్గ ఎన్నికల అధికారి స్వగృహంలో సిబ్బంది ఆయనను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిషత్ అధికారిగా పని చేస్తున్న వసంతరాయుడుని ఎన్నికల కమిషన్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా నియామకం చేసిందన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నాటి నుంచి నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందిని సమన్వయం చేసుకొని ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయన ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, మండల విద్యాశాఖాధికారి రోజ్ రాణి, చొప్పర రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనకు ఆర్థిక సాయం



పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టలవానిపాలెం ఎస్సీ కాలనీలో యువకులకు బాపట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, రేపల్లె నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామంలోని యువకులు సాంఘిక నాటకం ఏర్పాటు చేసుకున్నామని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో తన వంతు సాయంగా విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోవతోటి విజయ్, స్థానిక యువకులు ఉన్నారు.

17 నుంచి వాసవీ మాత రథోత్సవం




భట్టిప్రోలు: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలలో భాగంగా దివ్య రథోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. 17న బిందె తీర్థం, అమ్మవారి మూల విరాట్‌కు నవరస ఫల సహిత పంచామృతంతో సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి మహా సంప్రోక్షణ, మల్లెపూలతో వాసవీ అమ్మవారికి సామూహిక పూజలు, సహస్ర నామ పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. 18న సాయంత్రం 4 గంటలకు రథోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పవిత్ర వేషధారణలు, పురందర దాన భజనలు, కోలాటాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): ఆటో పల్టీ కొట్టిన ఘటనలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం–సత్యవతిపేట హైవేపై నిజాంపట్నం ప్రాంతానికి చెందిన ఆటో అధిక వేగంతో వెళ్తూ పక్కనే ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో గాయపడ్డ వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బండ్లమ్మ వార్షిక తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో బండ్లమ్మవారు



ఓలేటమ్మవారు



శ్రీ దేశమ్మ తల్లి

- ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
- పలు చోట్ల ప్రారంభం కానున్న గ్రామ దేవతల తిరునాళ్ల
- ఓలేరు తిరునాళ్లకు తరలి రానున్న భక్తజనం

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి (బండ్లమ్మ) అమ్మవారి వార్షిక తిరునాళ్ల బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పుష్ప మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రాతః కాలంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 9 గంటలకు అఖండ జ్యోతితో అమ్మవారి తిరునాళ్లకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి ఘటాలను చెరుకుపల్లి మండలం కుంచల వారిపాలెం గ్రామానికి గ్రామోత్సవం నిమిత్తం కనకతప్పెట్లు, బ్యాండు మేళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

22న ఓలేరు ఓలేటమ్మ తిరునాళ్ల

ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఓలేటమ్మ తిరునాళ్ల మహోత్సవాలు 22న ఘనంగా నిర్వహించనున్నారు. ఏటా గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోవటం ఇక్కడ ఆనవాయితీ వస్తోంది. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజునగర్, ఓలేరు నుంచి ప్రభలు వస్తాయి. ఓలేరు గొడపాలెం నుంచి చిన్నారులు ప్రభను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకురావడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పూజా కార్యక్రమాలతో పాటు తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకుడు బేతపూడి రజనీకాంత్ కృషి చేస్తున్నారు.

23న గొరిగపూడిలో దేశమ్మ తిరునాళ్ల

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ దేవత శ్రీ దేశమ్మతల్లి తిరునాళ్ల 23న అత్యంత వైభవంగా జరుగనుంది. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ పౌర్ణమి పర్వదినాన అమ్మవారి తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దేశమ్మ తల్లి ఆలయానికి ఎంతో పురాతన చరిత్ర ఉంది. సుమారు 230 సంవత్సరాల క్రితం నిర్మితమైనట్లు పెద్దలు చెబుతున్నారు. తిరునాళ్ల పురస్కరించుకుని ఆ రోజున అమ్మవారికి పసుపు, కుంకుమలు, దద్ది నైవేద్యాలు సమర్పించుకుంటారు. రాత్రికి భక్తులు, గ్రామస్తులు, ప్రజలు ఆకర్షణతో కూడిన ప్రభలను ఏర్పాటు చేసి అమ్మవారి తిరునాళ్లను వైభవంగా జరుపుకుంటారు. అమ్మవారి దేవాలయాన్ని పదేళ్ల క్రితం పునర్నిర్మాణం చేసి అత్యంత వైభవంగా తీర్చిదిద్దారు.

నియోజకవర్గంలో పెరిగిన ఓటింగ్ శాతం



భట్టిప్రోలు మండలం పెసర్లంకలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో ఎన్నికల శాతం గతేడాది కన్నా పెరగడంతో వైఎస్సార్ సీపీకి గెలుపు అవకాశాలు ఉన్నట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో 84.73 శాతం పోలింగ్ నమోదైంది. అప్పుడు వైఎస్సార్ సీపీకి 9,999 ఓట్లు మెజార్టీ వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం 86.43 శాతం నమోదైంది. గతేడాది కన్నా అదనంగా 4 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు చెప్పారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 238 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లు 1,97,458 మంది ఉన్నారు. 1,70,666 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎక్కువగా మహిళలు, వృద్ధులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు వద్ద బారులు దీరారు. దీంతో ఓటింగ్ నమోదు విషయంలో అధికారులు సకాలంలో సరైన సమాచారం అందించలేకపోయారు. నియోజకవర్గంలో 83,404 పురుష ఓట్లు, 87,248 మహిళా ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలోని మొత్తం ఓట్లు–1,97458
నియోజకవర్గంలో పోలైన ఓట్లు–1,70,666
చుండూరు మండలంలో మొత్తం ఓట్లు– 38,091 పోలైన ఓట్లు–32,755, అమర్తలూరు మండలంలో మొత్తం ఓట్లు–37,355 పోలైన ఓట్లు – 32,344
వేమూరు మండలంలో మొత్తం ఓట్లు–34,857 పోలైన ఓట్లు – 30,724, కొల్లూరు మండలంలో మొత్తం ఓట్లు– 45,059 , పోలైన ఓట్లు – 39,184
భట్టిప్రోలు మండలంలో మొత్తం ఓట్లు– 42,096 పోలైన ఓట్లు– 35,659

భట్టిప్రోలు: నెల రోజులకు పైగా ఎన్నికల చట్రంలో నలిగిపోయిన గ్రామాలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నాయి. రాజకీయ పార్టీల ప్రచారంలో భాగంగా మైకుల ధ్వనులు, వాహనాల కాలుష్యంతో నిండిపోయిన గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుంది. కుల మతాలకు అతీతంగా బంధువుల్లా తిరిగే వ్యక్తులు ఎన్నికల పుణ్యమా అని ప్రధాన పార్టీలలో ఏదో ఒక పార్టీ తరఫున ప్రచారం చేయడంతో నిన్న మొన్నటి దాకా స్పర్థలతో కాలం గడిచింది. ఒక్క రోజు కూడా కలుసుకోకుండా ఉండలేని స్నేహితులు, బంధువులను సైతం ఈ ఎన్నికలు నెల రోజుల పాటు ఎడం చేశాయి. ఒకరికొకరు ఎదురు పడినా మాట్లాడు కోలేని స్థితిలో ముందుకు సాగారు. సాయంత్రానికల్లా నలుగురూ ఒక చోట చేరి ఆహ్లాదకరంగా ముచ్చటించుకునే వారు సైతం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు. ఎన్నికలు ముగియడంతో ఇప్పటి వరకు ఉన్న స్పర్థలను వీడి గ్రామాల్లో ఇప్పుడిప్పుడే ఒకరికొకరు మనసు విప్పి మాట్లాడుకోవడం కనిపిస్తుంది.

రేపల్లె నియోజకవర్గంలో 84.19 శాతం పోలింగ్

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఇటీవల జరిగిన పోలింగ్‌లో రేపల్లె నియోజకవర్గంలో 84.19 శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు. స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 2,27,232 మంది ఓటర్లు ఉండగా 1,91,312 ఓట్లు పోలయ్యాయన్నారు. అందులో 92,385 మంది పురుషులు, 95,342 మంది మహిళలు, ముగ్గురు ఇతరులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,582 మంది ఉద్యోగులు, వికలాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వెల్లడించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో 83.19 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో ఒకశాతం అదనంగా పోలింగ్ పెరిగిందన్నారు.

తాగునీటి సమస్యపై తాత్సారం వద్దు

- మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల డిమాండ్
- అధికార యంత్రాంగం ఉదాసీనతపై మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకుమారి

కొల్లూరు : వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారంపై యంత్రాంగం దృష్టి కేంద్రీకరించక పోవడంపై ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణిపై సభ్యులు ప్రశ్నించారు. వేసవి ప్రారంభం నుంచి మండలంలోని పలు గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తి ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తాగునీటి పంపులు ఏర్పాటు చేయకపోవడంపై ఎంపీడీఓ లక్ష్మీకుమారిని నిలదీశారు. దీనిపై ఆమె పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంపులు ఏర్పాటు చేయలేకపోయామని బదులివ్వడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య వంటి ప్రధాన సమస్య విషయంలో జిల్లా కలెక్టర్ అనుమతితో సమస్య పరిష్కారానికి పంపులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా తాత్సారం చేయడం కారణంగా గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సర్వసభ్య సమావేశం నిర్వహించిన సమయంలోనే కొన్ని ప్రాంతాలలో తాగునీటి పంపుల నిర్మాణాలు చేపట్టాలని తీర్మానం చేసే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి రాలేని విషయాన్ని గుర్తు చేశారు. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఆ ప్రాంతాలలో తాగునీటి పంపులు ఏర్పాటు చేయకపోవడంపై పంచాయతీ యంత్రాంగాన్ని నిలదీశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా నగదు కొన్ని బ్యాంక్‌ల పరిధిలో డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ అవ్వలేదని తక్షణం ఆ నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు సత్కారం




కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండల కేంద్రంలోని రామకృష్ణ సేవాసమితిలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన దోగుపర్తి తులసి అక్షయ, త్రివేణి అమృత, పేరాల సాయి తేజశ్రీ,, షేక్ రిహానా, షేక్ జాస్మిన్‌లను అభినందించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, బాపిరాజు, రావి సుభాష్‌రెడ్డి, తుమ్మల శ్రీనివాసరావు, అలపాటి రమణారావు, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, లలితబాబు, కటూరి బాజి తదితరులు ఉన్నారు.

కృష్ణబాబు కాలనీలో ఇరువర్గాల దాడులు

నగరంపాలెం: స్థానిక కృష్ణబాబు కాలనీలో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన ప్రభు, మున్నా మధ్య స్వల్ప విషయమై గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ఇరువర్గాలు దాడులకు ఒడిగట్టారు. ఈ దాడిలో గాయపడిన షేక్. మున్నాతోపాటు పలువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. నగరంపాలెం పీఎస్ సీఐ మధుసూధనరావు, సిబ్బందితో ఘటనా స్థలానికి, ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన పలువురు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

గుర్తు తెలియని మహిళ మృతి



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 60 ఏళ్ల వయసు గల మహిళ తల, ముఖంపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. నారాకోడూరు –బుడంపాడు గ్రామాల మధ్య మిత్ర దాబా సెంటర్‌కు ఎదురుగా అర్ధరాత్రి సమయంలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతురాలు యాచకురాలు గా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతి చెందిన గుర్తు తెలియని మహిళ యొక్క ఆచూకీ తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని స్థానిక ఎస్ఐ పి మహేష్ కుమార్ తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదు

- పిన్నిబోయినవారిపాలెంలో పోలీస్ పికెట్ ఏర్పాటు
- 25 మందిపై కేసులు నమోదు
- రూరల్ సీఐ శ్రీహరి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీహరి

బాపట్లటౌన్: ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న అల్లర్లను అరికట్టేందుకు గాను బుధవారం గ్రామస్తులతో చర్చలు జరిపారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్నంత వరకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని, ఉద్దేశ పూర్వకంగా గొడవలకు దిగితే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సోదర భావంతో కలిసి మెలిసి జీవించాలన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వలన ఎంతో విలువైన జీవితం జైలు పాలు కావాల్సి వస్తుందన్నారు. గ్రామంలోని పెద్దలు యువకులు చేసే తప్పులను సరిచేస్తూ ప్రశాంతంగా ఉండేలా చూడాలన్నారు. యువతను రెచ్చగొట్టే విధంగా ఉసిగొల్పడం సరికాదన్నారు.

25 మందిపై కేసులు నమోదు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో పోలింగ్ రోజున ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులు ఒకరిపై మరొకరు దాడిచేసుకున్నారు. అదే రోజు రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెందిన కారును ధ్వంసం చేసి తగలపెట్టారు. మంగళవారం అదే గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి నిప్పంటించారు. ఈ నాలుగు ఘటనలకు సంబంధించి 25 మందిపై కేసులు నమోదుచేయటం జరిగిందని చెప్పారు. వీరిని బైండోవర్ చేశామన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి వికాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కమిటీ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు విద్యార్థులకు లెక్కలు, డ్యాన్స్‌లలో శిక్షణ ఇస్తున్నామని, ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు లెక్కలు, 11 నుంచి 12.30 వరకు డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. డాక్టర్ ఎస్.లెనిన్ బాబు, ప్రఖ్యాత డ్యాన్స్ మాస్టర్ చందు శిక్షణ ఇస్తున్నారని, 5,6,7 తరగతులు జూనియర్స్, 8,9,10 తరగతులు సీనియర్స్‌గా విభాగాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు కల్యాణి, జి.రమ్య, సంధ్యారాణి, వజాక్ నూటన్ పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది ఎగువ ప్రాంతంలో నీటిలో మృతదేహం ఉన్నట్లు బుధవారం సాయంత్రం తాడేపల్లి పోలీసులకు మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 6వ గేట్ వద్ద ఉన్న వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు తెల్లచొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తల్లి ఇంటికి నిప్పు పెట్టిన కుమార్తె

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కుమార్తె తల్లి ఇంటికి నిప్పు పెట్టిన వైనం ఇది. పోలీసుల కథనం మేరకు చెంచుపేట ఎమ్మెల్యే బజారులో తన ఇద్దరు మనవరాళ్లతో కలసి ఓ వృద్ధురాలు పూరింట్లో నివాసం ఉంటోంది. సదరు వృద్ధురాలి కుమార్తె మున్నంగి సుజాత, తన మేనల్లుడు, మరో వ్యక్తితో కలసి మంగళవారం రాత్రి తన తల్లి నివసించే ఇంటికి నిప్పు పెట్టింది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఆగలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

పొన్నూరులో ప్రజారంజక పాలన చూపిస్తా

- వెంట నడిచిన ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటా
- పొన్నూరులో మహిళా ఓటింగ్ పెరగటం శుభ సూచకం
- అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల ప్రచారంలో మండుటెండలో నా వెంట నడిచారు.ఎంతో ఆదరాభిమానాలు చూపారు. నా గెలుపు మీ విజయంగా భావించి ప్రచారం చేశారు. మీ అందరికీ రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ ప్రస్థానం పొన్నూరులో ప్రారంభం కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. జూన్ 4 తర్వాత పొన్నూరులో ధర్మ పరిపాలన తీసుకువస్తానని అన్నారు. సీఎం జగన్ అందించిన పథకాలకు ఆకర్షితులైన ప్రజలు 90 శాతం మంది వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి ఓటేశారని బలంగా నమ్ముతున్నానని అన్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ సునాయసంగా గెలవనుందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో 142 నుంచి 160 స్థానాల్లో పార్టీ విజయ ఢంకా మోగించనుందని పేర్కొన్నారు.

పొన్నూరులో మహిళలు అధికశాతంలో ఓటేసి ప్రభుత్వంపై తమ అభిమానాన్ని చాటారని వెల్లడించారు. ఇక్కడ టీడీపీ నాయకుల మైండ్ గేమ్ పని చేయలేదన్నారు. రిగ్గింగుకు పాల్పడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదన్నారు. అధికారులు, పోలీసులు ఎంతో బాధ్యతగా పని చేసి ఎన్నికలు సజావుగా సాగటంలో బాధ్యతగా వ్యవహరించారన్నారు. సమావేశంలో ఏయంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు బొనిగల వేణుప్రసాద్, వడ్రాణం ప్రసాద్, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, షేక్ షర్మిల, అమిరినేని సాంబశివరావు, షేక్. జానిబాషా, సుభాని, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్సులో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్ 108 అంబులెన్సులో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బీజెడ్ సీ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బయోకెమిస్ట్రీ మైక్రోబయాలజీ, బీఫామసీ, డీఎంఎల్టీ చదివిన వారు ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. అభ్యర్థుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలని, ఉద్యోగానికి ఎంపికైన వారు తెనాలి, మంగళగిరి, పట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, గుంటూరు ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో రెండో అంతస్తులోని 108 కార్యాలయంలో 9121892889 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

మన చేతుల్లోనే కుటుంబ వ్యవస్థ



మాట్లాడుతున్న సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వర రావు, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ప్రపంచం ఎంతగా మారుతున్నప్పటికీ మన కుటుంబ వ్యవస్థను కాపాడుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందని, నా బలగమే నా బలం అని గుర్తించిన వారికి కుటుంబమే స్వర్గం అవుతుందని సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వ మనుగడ సాధనలో కుటుంబ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తోందనీ, నేటి నవతరానికి సామాజిక ఆర్థిక సంరక్షణకు క్రమశిక్షణకు అవసరమైన సంస్కారాలను విలువను అందించటానికి కుటుంబమే ప్రధాన సాధనమన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

రైల్వే ఉద్యోగిపై దాడి

తాడేపల్లి రూరల్: రైల్వే ఉద్యోగిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేశారు. ఈ నగర పాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న బకింగ్‌హామ్ బ్రిడ్జి దిగువ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ టీఆర్‌డీ డిపార్టుమెంట్‌లో బలమాల హంస్సేన్ పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైపాస్ రోడ్డులో వెళుతుండగా వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి దిగువ ప్రాంతంలో బకింగ్‌హామ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్ర వాహనం ఆపి నిలబడ్డాడు. అదే సమయంలో ఎదురుగా మహిళలు ఉండటంతో మరో వాహనం పక్కకు తీయాలని హంస్సేన్ కోరాడు. అటువైపు నుంచి నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు యువకులు ఏంట్రా నువ్వు మాకు చెప్పేదంటూ హంస్సేన్‌తో గొడవకు దిగారు. మిమ్మల్ని కాదని అంటున్నా వినకుండా సిమెంట్ రేకుతో బలంగా తలపై మోదడంతో గాయమైంది. వెంటనే ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న తోటి రైల్వే ఉద్యోగులు హడావుడిగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని విజయవాడ రైల్వే ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.